గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదాం

- రూరల్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం
- కార్యకర్తలకు మంత్రి వేణు పిలుపు
- ధవళేశ్వరంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి చెల్లుబోయిన వేణు. చిత్రంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుదామని, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన అనంతరం తొలిసారి శనివారం ధవళేశ్వరంలోని శ్రీమతి జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని, ప్రతి ఒక్కరూ ఆశీర్వదించి, ప్రతి నాయకుడు, కార్యకర్త గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉందని మరింత సమష్టిగా ప్రజల ముందుకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి పార్టీని మరింత చేరువ చేయాలని సూచించారు. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావుతో తనకున్న అనుబంధాన్ని మంత్రి వేణు వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి పార్టీకి విజయాన్ని అందించాలన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీని విజయపథంలో నడిపించాలన్నారు. రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ మాట్లాడుతూ మంత్రి వేణును అధిక మెజారీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

జనార్దనుడిని దర్శించుకున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: రూరల్ కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి ధవళేశ్వరం వచ్చిన మంత్రి వేణు శ్రీలక్ష్మీజనార్దనస్వామి, ధవళేశ్వరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

కడియం: పెరిగిన రూ.3వేల పింఛన్లతోపాటు కొత్తగా మంజూరైన 183 పింఛన్ల పంపిణీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని ఎంపీడీవో కే రత్నకుమారి తెలిపారు. మండల కేంద్రమైన కడియంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రూరల్ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస్‌వేణు గోపాలకృష్ణ చేతుల మీదుగా పెరిగిన పెంఛన్ల పంపిణీ ప్రారంభిస్తారన్నారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లోనూ 12,142 మందికి వైఎస్సార్ సామాజిక భద్రతా పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారని ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు.

వైభవోపేతంగా నృత్యారాధన

ధవళేశ్వరం: ధనుర్మాస నృత్యారాధన కార్యక్రమాన్ని నాట్య పండితులు, నర్తనయోగి డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ధవళేశ్వరం శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో వైభవోపేతంగా నిర్వహించారు. తొలుత స్వామి సన్నిధిలో ఏకాదశ నర్తకీమణుల బృందం నృత్యార్చన చేసింది. అనంతరం వేదికపై నృత్యారాధన చేశారు. అనంతరం సప్పా దుర్గాప్రసాద్‌కు గురు సత్కారం చేసి, నర్తకీమణులందరికీ ప్రశంసాపత్రాలు ,జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ సాధనాల చంద్రశేఖర్(శివ), జిల్లా టీఎస్‌టీయూసీ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు ,ఆలయ కార్యనిర్వహణాధికారి నాగ సురేష్, ప్రధానార్చకులు అనంత సత్యవల్లభాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం

రాజమహేంద్రవరం సిటీ: పారిశుద్ధ్య అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని కమిషనరు కె.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు 742,42 డ్రైవర్లు సమ్మెలో పాల్గొంటున్నారని అయినప్పటికీ అందుబాటులో ఉన్న శాశ్వత సిబ్బందితో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్య పనులపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని, ఎటువంటి అలసత్వము వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు. ఆయన తోపాటు మున్సిపల్ ఆరోగ్య అధికారి డా.ఎ.వి నూత్న, శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది ఉన్నారు.

సావిత్రీబాయిఫూలే స్ఫూర్తిదాయకం

కడియం: మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీబాయి ఫూలే జీవితం స్ఫూర్తిదాయకమని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత అన్నారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేమగిరి హైస్కూలులో మహిళా అసోసియేట్ ఎం.వనజ అధ్యక్షతన సావిత్రీబాయి జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఈవీవీఎస్ఎస్ ప్రసాద్, బి.అబ్బాయి, వీవీ శాస్త్రి తదితరులు మాట్లాడుతూ సావిత్రీబాయి జీవిత విశేషాలను వివరించారు.

నేడు చెకుముకి సంబరాలు

కంబాలచెరువు: స్థానిక గౌతమీ స్కూలులో ఈ నెల ఏడో తేదీన జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్టు ఆ వేదిక అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు శనివారం తెలిపారు. శ్రీరామ్‌నగర్‌లో జరగనున్న ఈ వేడుకలకు విద్యార్థుల టీంలు హాజరుకావాలన్నారు.

శ్రామికుల కోసం ప్రత్యేక భవనం

- సభలు, సమావేశాలు, శుభకార్యాల కోసం ఏర్పాటు
- క్వారీ సెంటర్లో శంకుస్థాపన చేసిన ఎంపీ మార్గాని భరత్ రామ్



మాట్లాడుతున్న వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, ఎంపీ భరత్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: కష్టాన్ని నమ్ముకునే కార్మికులకు నీడనివ్వాలనే ఉద్దేశంతో వైఎస్సార్ శ్రామిక భవనాన్ని నిర్మిస్తున్నట్టు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం నగరంలోని క్వారీ సెంటర్ చేపల మార్కెట్ వెనుక నిర్మించబోయే వైఎస్సార్ శ్రామిక భవనానికి ఎంపీ భరత్ శంకుస్థాపన చేశారు. అంతకు ముందు అక్కడికి సమీపంలో ఉన్న దివంగత బత్తిన సుబ్బారావు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎంపీ మాట్లాడుతూ శ్రామికుల కోసం భవనం నిర్మించాలనుకున్నానన్నారు. క్వారీ సెంటర్ ప్రాంతం అనగానే శ్రామికులే గుర్తుకు వస్తారని, శ్రామికులంతా దివంగత బత్తిన సుబ్బారావును తమ ఆరాధ్యదైవంగా భావిస్తారని, అందుకే శంకుస్థాపనకు ముందు ఆయనకు ఘన నివాళులర్పించడానికి ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. భవనం నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి కోటి రూపాయలను మంజూరు చేసినట్టు తెలిపారు. నగర పాలక సంస్థ భవన నిర్మాణానికి అవసరమైన ప్రస్తుతం 35 సెంట్ల స్థలం కేటాయించిందని, వారం రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని, పనులు కూడా త్వరితగతిన ప్రారంభమవుతాయని ఎంపీ తెలిపారు. బహుశా రాజమండ్రి నగరంలో నిర్మించబోయే వైఎస్సార్ శ్రామిక భవనం దేశంలోనే ఎక్కడా లేని అద్భుత కట్టడం కాబోతోందని అన్నారు. భవనంపైన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ భవనాన్ని సభలు, సమావేశాలు, ఉత్సవాలు, శుభ కార్మికులకు ఉచితంగా ఇస్తామన్నారు. తాను ఎంపీ అయిన తరువాత సీఎం జగనన్న సహకారంతో ఏ విధంగా రాజమండ్రిని అభివృద్ధి చేశానో నగర ప్రజలు చూశారు..ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దుతాను అన్నారు. నగరంలో పుష్కర్ ఘాట్ సమీపంలోని చిత్రాంగి గెస్ట్ హౌస్ వద్ద త్వరలో చిత్రాంగి యోగా పార్కు రాబోతోందని, గోదావరి గట్టును హైదరాబాదు టాంక్ బండ్ మాదిరిగా అభివృద్ధి చేయబోతున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా నా లక్ష్యం, అజెండా నగర అభివృద్ధే అన్నారు. సభలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్ రెడ్డి, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎస్వీ శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్, అజ్జరపు వాసు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ప్రసంగించారు. ఎంపీ భరత్ విజన్ ఉన్న నాయకుడని, నగర అభివృద్ధిలో తనదైన ముద్ర రాజమండ్రి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని కొనియాడారు.

నిస్వార్థ సేవకు నిదర్శనం స్వర్ణాంధ్ర

- ఎంపీ భరత్ రామ్
- ఘనంగా స్వర్ణాంధ్ర రజతోత్సవ వేడుకలు
- కుట్టు మెషీన్లు, రగ్గుల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: మానవత్వానికి, నిస్వార్థ సేవకు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఒక ప్రతిబింబంగా నిలుస్తోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ పేర్కొన్నారు. శనివారం లాలా చెరువులోని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ భరత్ మాట్లాడుతూ కలలు కనే తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో అనాథలుగా రోడ్డున వదిలేయడం ఏ మాత్రం భావ్యం కాదని, స్వర్ణాంధ్ర రాంబాబు మానవత్వంతో ఎందరో అభాగ్యులు, వృద్ధులు, అనాథులను అక్కునజేర్చుకోవడం అభినందనీయమన్నారు. సేవా తత్పరతతో మంచి పనులు చేసే స్వర్ణాంధ్రా సంస్థను ఆదరించి, సహకరించాలన్నారు. నగరంలో గౌతమీ జీవకారుణ్య సంఘంలో వృద్ధులు, కుష్ఠు వ్యాధిగ్రస్తులకు మరిని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ మనం చేసే పని మంచిదైతే ఆ దైవమే సహకరిస్తుందన్నారు. 25 ఏళ్లుగా రాంబాబు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వృద్ధులకు రగ్గులు, 12 మంది పేద మహిళలకు కుట్టు మెషీన్లను ఎంపీ భరత్‌రామ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పూలే చైతన్య వేదిక వ్యవస్థాపకులు నయానాల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ గుత్తుల మురళీధరరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం మూడు రాష్ట్రాల అధ్యక్షులు పి సతీష్, మాజీ అధ్యక్షులు ఎంఎఫ్‌జె బెనర్జీ, ప్రధాన కార్యదర్శి ఎం కోదండరాం, పిఎంపి వైద్య సంఘం నాయకులు బళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన కార్యశాల

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో మూడు రోజుల పాటు నిర్వహించిన చిట్టి పరిశోధన/కార్యాచరణ పరిశోధన కార్యశాల శనివారంతో ముగిశాయి. శిక్షణార్థులు వారు బోధించే అంశాలైన తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం, సాధారణ అంశాలపై కార్యాచరణ పరిశోధన ప్రతిపాదనలను తయారు చేసి డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణకు సమర్పించారు. డైట్ అధ్యాపకులు బాలరాజు తెలుగుకి, కె.వి.సూర్యనారాయణ, కె.గంగాధరరావు గణితానికి, ఆంగ్లానికి డాక్టర్ ఎస్.ఎ స్టేర్, పరిసరాల విజ్ఞానానికి జె.కళావతి, సాధారణ అంశాలకు డి.ఎస్.వి సత్యనారాయణ, డి.సుజాతా రత్నం గైడ్స్‌గా వ్యవహరించి తగు సూచనలు సలహాలు అందజేశారు. ఉపాధ్యాయులు తీసుకున్న అంశంపై కార్యాచరణ పరిశోధన చేపట్టి నివేదికను డైట్‌లో సమర్పించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు

సీటీఆర్ఐ: సాహితీవేత్తగా, ఉద్యమకారుడిగా, నిబద్ధతతో జీవితాన్ని గడిపిన బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు అని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్, ఏపీ విశ్రాంత న్యాయమూర్తి ఆశపు రామలింగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక వీరేశలింగం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అరసం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన పడాల రామారావు శతజయంత్యుత్సవ సభలో ఆశపు రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు మందలపర్తి కిషోర్, తూర్పుగోదావరి జిల్లా అరసం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, సంజీవరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గరుడ వాహన సేవ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు గ్రామంలో కాతేరు వెళ్లే రోడ్డు రామాలయం వద్ద శ్రీ అమ్మఒడి సేవా తరంగిణి ఆధ్వర్యంలో శనివారం శ్రీవారి గరుడ వాహన సేవ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకను బ్రహ్మ శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ చేతుల మీదుగా ప్రారంభించారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి శ్రీవారి గరుఢ సేవలో పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏలో న్యాయ విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: స్థానిక జిల్లా న్యాయసేవాధికార కార్యాలయంలో శనివారం వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి మాట్లాడారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కె.సామ్యూల్‌రాజు, న్యాయవాది డీవీకే.రమేష్, ప్యానల్ లాయర్ డి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.